క్లుప్తంగా

రైతులకు భారీగా రుణాలు


మాట్లాడుతున్న ఆర్ఎం శివలీల

శిరివెళ్ల: జిల్లాలోని రైతాంగానికి భారీగా రుణాలను పంపిణీ చేస్తున్నట్లు కేడీసీసీ జిల్లా ప్రాంతీయ మేనేజర్ శివలీల తెలిపారు. సోమవారం స్థానిక కేడీసీసీ బ్రాంచిని తనిఖీ చేశారు. ఆమె మాట్లాడుతూ.. 2023– 24 ఖరీఫ్ సీజన్‌కు రూ.174 కోట్ల దీర్ఘకాలిక, స్వల్ప కాలిక రుణాలు జారయ్యాయన్నారు. అలాగే డ్వాక్రా సంఘాలకు రూ. 4 కోట్లు, మత్స్యకారులకు రూ.25 లక్షలు పంపిణీ చేశామని చెప్పారు. వైఎస్సార్ యంత్ర సేవా పథకం కింద ట్రాక్టర్లు, వరి కోతల మిషన్లు రైతులకు అందజేశామన్నారు. సహకార సంఘాల సిబ్బందికి త్వరలో గోస్పాడు మండలం యాళ్లూరు సహకార సంఘంలో కంప్యూటర్ రైజేషన్‌పై శిక్షణ ఇస్తామని తెలిపారు.

వీఆర్ఏలను రెగ్యులర్ చేయాలి

నంద్యాల(న్యూటౌన్): వీఆర్ఏలను రెగ్యులర్ చేసి వీఆర్ఓలుగా ప్రమోషన్లు కల్పించాలని సీఐటీయూ ఆధ్వర్యంలో నంద్యాల జిల్లా కలెక్టర్ కార్యాలయం ఎదుట నిరాహార దీక్షలు చేపట్టారు. మంగళవారం రెండో రోజుకు చేరుకున్న నిరాహార దీక్షల్లో ఏపీ అంగన్‌వాడీ వర్కర్స్ అండ్ హెల్పర్స్ యూనియన్ సీఐటీయూ జిల్లా కార్యదర్శి ఎం.నిర్మలమ్మ, సీఐటీయూ జిల్లా ప్రధాన కార్యదర్శి బాలవెంకట్ పాల్గొన్నారు. వారు మాట్లాడుతూ వీఆర్ఏలకు పేస్కేల్ అమలు చేయాలని, నామినల్‌గా పని చేస్తున్న వారందరికీ వీఆర్ఏలుగా ప్రమోషన్లు ఇవ్వాలని అన్నారు. కార్యక్రమంలో ఏపీ గ్రామ రెవెన్యూ సహాయకుల సంఘం జిల్లా నాయకులు శ్రీనివాసులు, మహేష్, సలాం, అబ్దుల్, గఫూర్, బాషా, మాలి తదితరులు పాల్గొన్నారు.

భక్తిశ్రద్ధలతో అష్టాదళ పాద పద్మారాధన సేవ


అష్టాదళ పాద పద్మారాధన సేవలో అమ్మవారు

నంద్యాల(వ్యవసాయం): పట్టణంలోని గాంధీచౌక్‌లో వెలసిన శ్రీకాళికాంబా చంద్రశేఖర దేవస్థానంలో అధిక శ్రావణమాసాన్ని పురస్కరించుకొని మంగళవారం అమ్మవారికి అష్టాదళ పాద పద్మారాధన సేవ వైభవంగా నిర్వహించారు. తెల్లవారుజామునే అమ్మవారి మూలవిరాట్‌కు సుప్రభాతసేవ, పంచామృతాభిషేకాలు, వివిధ రకాల పండ్ల రసాలు, నిమ్మరసంచే ప్రత్యేక అభిషేకం చేశారు. అనంతరం 108 వెండి పుష్పాలచే అమ్మవారికి ప్రత్యేక పూజా కార్యక్రమం చేపట్టారు. అనంతరం అమ్మవారికి చీర, ఒడి బియ్యం సమర్పించారు. కార్యక్రమంలో ఈఓ లక్ష్మీనారాయణ, అర్చకులు రాఘవేంద్రాచారి,సుబ్బాచారి, ఆరవేటి వాసు, విజయకుమార్ తదితరులు పాల్గొన్నారు.

మాయలూరు ఆర్‌బీకేకు డ్రోన్

ఉయ్యాలవాడ : మండలంలోని మాయలూరు రైతు భరోసా కేంద్రానికి మొదటి విడతగా డ్రోన్ మంజూరైనట్లు ఏఓ రాజేంద్రకుమార్ తెలిపారు. మంగళవారం ఆయన మాట్లాడుతూ డ్రోన్ పరికరం విలువ రూ.12 లక్షలు కాగా ప్రభుత్వ సబ్సిడీ రూ. 5.75 లక్షలు పోను మిగతా రూ.6.25 లక్షలు రైతు వాటాగా చెల్లించాలన్నారు. అగ్రికల్చర్ బీఎస్సీ కోర్స్ పూర్తి చేసిన మాయలూరుకు చెందిన జనపాల సాయిరెడ్డి అనే రైతును ఎంపిక చేసినట్లు తెలిపారు. ఎంపికయిన రైతుకు రాజధాని అమరావతిలో12 రోజుల పాటు పైలట్ శిక్షణ ఇవ్వడం జరుగుతుందన్నారు.

ఘనంగా జియారత్


ప్రత్యేక అలంకరణలో ఇమాంకాశీం స్వామి

దొర్నిపాడు: మండలంలోని క్రిష్టిపాడు గ్రామంలో మంగళవారం ఇమాం కాశీం, దస్తగిరి స్వాముల జియారత్ వేడుకలను ఘనంగా నిర్వహించారు. కులమతాలకు అతీతంగా పులగం, పానకం, చక్కెరలను పాతేహాలు సమర్పించి మొక్కులు తీర్చుకున్నారు. అనంతరం ఇమాం కాశీం, దస్తగిరి పీర్లను ప్రత్యేకంగా అలంకరించి ఊరేగించారు.

ఆయకట్టుకు నీటిని విడుదల చేయాలి

నంద్యాల(సెంట్రల్): శ్రీశైలం జలాశయంపై ఆధారపడిన పలు ప్రాజెక్టుల పరిధిలోని కాలువలకు నీటిని విడుదల చేయాలని రాయలసీమ సాగునీటి సాధన సమితి ప్రతినిధులు కోరారు. ఈ మేరకు సమితి ఉపాధ్యక్షులు వైఎన్ రెడ్డి, ఏరువ రామచంద్రారెడ్డి నేతృత్వంలో సభ్యులు, ఆయకట్టు రైతులు జిల్లా రెవెన్యూ అధికారి పుల్లయ్య, కేసీ కెనాల్ కార్య నిర్వాహక ఇంజినీరు తిరుమలేశ్వరరెడ్డికి వేర్వేరుగా వినతి పత్రం అందించారు. వారు మాట్లాడుతూ... ఎస్ఆర్‌బీసీ, కేసీ కాలువ, తెలుగుగంగ, హంద్రీనీవా ఆయకట్టుకు తక్షణమే నీటిని విడుదల చేయాలని డిమాండ్ చేశారు. శ్రీశైలం జలాశయంలో నీటి మట్టం 875 అడుగులకు చేరినప్పుడు మాత్రమే విద్యుదుత్పత్తి ప్రారంభించాల్సి ఉందన్నారు. ఐఏబీ సమావేశంలో నీటి విడుదల తేదీలను స్పష్టంగా ప్రకటించాలన్నారు.

చిన్నారుల రక్షణకు 'ఇంద్రధనస్సు'

- గవదబిళ్లలు, రుబెల్ల నివారణకు ప్రభుత్వ చర్యలు
- ప్రారంభమైన టీకాల కార్యక్రమం
- చిన్నారులు, గర్భిణుల గుర్తింపునకు సర్వే
- ప్రతి ఇంటా వివరాలు సేకరిస్తున్న వైద్యసిబ్బంది
- ఇప్పటి వరకు జిల్లా వ్యాప్తంగా 5,572 మంది గుర్తింపు


ప్రభుత్వాసుపత్రిలో వ్యాక్సినేషన్‌ను పరిశీలిస్తున్న డీఎంఅండ్‌హెచ్ఓ వెంకటరమణ

నంద్యాలటౌన్: చిన్నారులు, గర్భిణుల ఆరోగ్య సంరక్షణకు ప్రభుత్వం పటిష్ట చర్యలు చేపడుతోంది. కోవిడ్ బాగా విజృంభిస్తున్న తరుణంలో, ఇతర కారణాలతో యాంటీ వైరస్ ఇంజెక్షన్ (టీకా) వేయించుకోలేకపోయిన గర్భిణులు, ఐదేళ్లలోపు పిల్లలను మంప్స్ (గవదబి ళ్లలు), రుబెల్ల వైరస్ నుంచి రక్షించేందుకు ప్రభుత్వం మిషన్ ఇంద్రధనస్సు కార్యక్రమాన్ని ప్రతిష్టాత్మకంగా నిర్వహిస్తోంది. కార్యక్రమంలో భాగంగా వైద్యసిబ్బంది ప్రతి ఇంటికీ వెళ్లి గర్భిణులు, ఐదేళ్ల లోపు పిల్లల వివరాలను సేకరిస్తున్నారు. టీకాలు వేంచుకోని వారిని గుర్తించి మూడు విడుతల్లో వ్యాక్సిన్ వేయనున్నారు.

మొదటి విడుత ప్రారంభం..

పిల్లలకు వ్యాధి నిరోధక టీకాలు వేయించి రుబెల్లా, గవదబిళ్లలు నిరోధించేందుకు జిల్లా వైద్య యంత్రాంగం సిద్ధమైంది. ఆగస్టు 7వ తేదీ నుంచి 12 వరకు మొదటి విడతగా, సెప్టెంబరు 11 నుంచి 16 వరకు రెండో విడతగా, అక్టోబర్ 9 నుంచి 14వ తేదీ వరకు మూడో విడతగా వ్యాధి నిరోధక టీకాలు వేసే కార్యక్రమం నిర్వహించనున్నారు. టీకాలు తప్పిపోయిన రెండేళ్లలోపు పిల్లలకు, 2–5 ఏళ్లలోపు పిల్లలకు బూస్టర్ డోస్ వేస్తారు. మొదటి విడత కార్యక్రమం ఇప్పటికే ప్రారంభమయ్యింది. ఇందులో భాగంగా వారం రోజుల పాటు స్థానిక సచివాలయాలు, అంగన్‌వాడీ సెంటర్లలో, ఆరోగ్య ఉప కేంద్రాల్లో టీకాలు వేయనున్నారు. ఇప్పటికే ఆశావర్కర్లు, వైద్య సిబ్బంది నిర్వహిస్తున్న ఇంటింటి సర్వేలో గర్భిణులు, రెండేళ్లలోపు పిల్లలు, 2–5 ఏళ్ల లోపు పిల్లల వివరాలు నమోదు చేస్తున్నారు.

5,572 మందికి ఉచితంగా టీకాలు

ఇప్పటి వరకు జిల్లా వ్యాప్తంగా నిర్వహించిన సర్వేలో 5,572 మంది టీకాలు వేయించుకొలేదని నిర్ధారించారు. వీరిలో 1,121 మంది గర్భిణులు, 2 ఏళ్ల లోపు పిల్లలు 3,223, 2 నుంచి 5 ఏళ్ల మధ్య పిల్లలు 1,228 మంది ఉన్నారు. వారితో పాటు ఇంకా వ్యాధినిరోధక టీకాలు వేయించుకోని వారిని గుర్తించి ఈ కార్యక్రమంలో టీకాలు వేయనున్నారు.

ప్రభుత్వ ఆసుపత్రుల్లో ఉచితంగా టీకాలు

పట్టణ ప్రాంతాల్లో ప్రభుత్వ ఆస్పత్రుల్లో, ఆరోగ్య కేంద్రాల్లో ఉచితంగా టీకాలు వేస్తారు. ప్రైవేటు ఆస్పత్రులలో కూడా ఇమ్యూనైజేషన్ వ్యాక్సిన్లు అందుబాటులో ఉంటాయి. కానీ వాటికి డబ్బులు చెల్లించాల్సి ఉంటుంది. ప్రైవేటుగా ఈ వ్యాక్సిన్ వేసుకోవడానికి రూ.4 వేల నుంచి రూ.5 వేల వరకు చెల్లించాల్సి ఉంటుంది. ఈ వ్యాక్సిన్లను ప్రభుత్వం ఉచితంగా అందిస్తోంది. ప్రభుత్వ, ప్రైవేటు ఆస్పత్రుల్లో ఈ వ్యాక్సిన్లు అందుబాటులో ఉంటాయి. ప్రభుత్వ ఆమోదం పొంది లైసెన్స్ ఉన్న తయారీదారుల నుంచే ప్రభుత్వ, ప్రైవేటు ఆస్పత్రుల యాజమాన్యాలు టీకాలను కొనుగోలు చేస్తాయి. వ్యాక్సిన్లు అన్నింటికీ డ్రగ్ కంట్రోల్ జనరల్ ఆఫ్ ఇండియా లైసెన్స్ ఉంటుంది. కావున ఇవి సురక్షితమైనవని, వీటి నాణ్యత గురించి ఏమాత్రం భయపడనవసరం లేదని వైద్యాధికారులు చెబుతున్నారు. వ్యాక్సిన్ల వల్ల పిల్లల్లో రోగనిరోధకశక్తి పెరిగి ప్రమాదకరమైన జబ్బుల బారిన పడకుండా ఉంటారని పేర్కొంటున్నారు.

పకడ్బందీగా మిషన్ ఇంద్రధనస్సు

గర్భిణులు, చిన్న పిల్లల ఆరోగ్య రక్షణకు ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా నిర్వహిస్తున్న ఇంద్రధనుస్సు కార్యక్రమంలో వైద్య సిబ్బంది ఇంటింటి సర్వే నిర్వహించి టీకా వేయించుకోనివారి జాబితా తయారు చేస్తారు. సర్వే పకడ్బందీగా చేపట్టేలా తరచూ తనిఖీలు నిర్వహించా.ం జిల్లా వ్యాప్తంగా టీకాల కార్యక్రమాన్ని విజయవంతంగా నిర్వహిస్తున్నాం.

–డాక్టర్ మల్లికార్జునరెడ్డి, జిల్లా టీకా అధికారి

తప్పక టీకాలు వేయించుకోవాలి

ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన ఈ కార్యక్రమం గురించి ఇప్పటికే తగిన మార్గదర్శకాలు జారీ చేశాం. ప్రతి తల్లి పిల్లలకు సమయానికి రోగనిరోధక టీకాలు వేయించాలి. నిర్దిష్ట సమయంలో నిర్ణీత వ్యాక్సిన్ చేయించడం ద్వారా పిల్లలు ఆరోగ్యంగా ఎదగడమే కాకుండా ప్రాణాంతకమైన పలు వ్యాధుల బారిన పడకుండా కాపాడుకోవచ్చు.

–డాక్టర్ వెంకటరమణ, జిల్లా వైద్యాధికారి

స్టేజ్-1 అధికారుల నియామకం

ఉయ్యాలవాడ : మండలంలోని నర్సిపల్లె, హరివరం గ్రామ పంచాయతీల్లో 5,7 వార్డు సభ్యుల స్థానాల ఉప ఎన్నికకు నామినేషన్ల పర్వం మొదలయింది, ఇందులో భాగంగా స్టేజ్ -1 అధికారులను నియమించినట్లు ఎంపీడీఓ ఉమామహేశ్వరరావు మంగళవారం తెలిపారు. స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో స్టేజ్-1 అధికారులకు ఎన్నికల నియమావళిపై శిక్షణా కార్యక్రమం నిర్వహించారు. నర్సిపల్లె గ్రామానికి స్టేజ్- 1 అధికారిగా ఆర్ డబ్ల్యూఎస్ ఏఈ ఫణీత్‌కృష్ణ, హరివరానికి పంచాయతీ రాజ్ ఏఈ రామకృష్ణారెడ్డిలను నియమించారు. ఈ నెల 10వ తేదీ వరకు నామినేషన్లు స్వీకరిస్తారన్నారు. కార్యక్రమంలో ఈఓపీఆర్డీ వెంకటేశ్వర్లు, పంచాయతీ కార్యదర్శులు మదనగోపాల్ రెడ్డి, రాజశేఖర్ పాల్గొన్నారు.

ఆసుపత్రి సిబ్బంది మొండి వైఖరి వీడాలి

నంద్యాల(న్యూటౌన్): ప్రభుత్వ సర్వజన ఆసుపత్రిలో రోగులపై డాక్టర్లు, నర్సులు అవలంబిస్తున్న మొండి వైఖరి విడనాడాలని సీపీఐ పట్టణ కార్య దర్శి ప్రసాద్, సోమన్న అన్నారు. మంగళవారం స్థానిక సీపీఐ కార్యాలయంలో ఏర్పాటు చేసిన సమావేశంలో వారు మాట్లాడుతూ నంద్యాల ప్రభు త్వ ఆసుపత్రిలో పేదలకు ఉపయోగకరంగా వైద్యం అందని ద్రాక్షలా మారిందన్నారు. ఆక్సిజన్ సరైన సమయంలో అందించక చిన్నారులు ఇటీవల కాలంలో మరణించడం జరిగిందన్నారు. నంద్యాల చుట్టుపక్కల ప్రాంతాల నుంచి పేదలు ప్రభుత్వ ఆసుపత్రికి వస్తున్నారని, వారి పట్ల డాక్టర్లు, నర్సులు ప్రత్యేక శ్రద్ధ తీసుకోవడం లేదని ఆరోపించారు. దురుసుగా ప్రవర్తిస్తున్నారని విమర్శించారు. శ్రీనివాసులు, సురేష్, సుబ్బరాయు డు, కలాం బాషా, మాబాషా తదితరులు పాల్గొన్నారు.

ఇంటింటికీ వెళ్లి.. భరోసా కల్పించి


సమస్యలు పరిష్కరించాలని అధికారులను ఆదేశిస్తున్న ఎమ్మెల్యే గంగుల బిజేంద్రారెడ్డి

- ఆళ్లగడ్డ పట్టణంలో గడప గడపకు మన ప్రభుత్వం నిర్వహించిన ఎమ్మెల్యే గంగుల బిజేంద్రారెడ్డి
- బ్రహ్మారథం పట్టిన ప్రజలు

ఆళ్లగడ్డ: ఏమ్మా బాగున్నావా.. అవ్వా ఆరోగ్యం ఎలా ఉంది?.. తాతా పింఛన్ ఇంటి దగ్గరకే వచ్చి ఇస్తున్నారా ?.. అక్కా పిల్లలను బాగా చదివించండి .. చిన్నా ఏం చదువుతున్నావు.. అన్నా ఏమైనా సమస్యలు ఉన్నాయా?.. అంటూ చిరునవ్వుతో ఆప్యాయంగా అందర్నీ పలకరిస్తూ ఎమ్మెల్యే గంగుల బిజేంద్రారెడ్డి ముందుకు సాగారు. మన జగన్ ప్రభుత్వం ఈ సంక్షేమ పథకాలను మీకు అందించింది.. ఏమైనా రాక పోతే చెప్పండంటూ అడుగుతూ.. సమస్యలు తెలుసుకుని పరిష్కారానికి చర్యలు తీసుకుంటూ గడప గడపకు మన ప్రభుత్వ కార్యక్రమం చేపట్టారు. మంగళవారంతో పట్టణంలో కార్యక్రమం పూర్తయింది. చివరిరోజు 6వ సచివాలయ పరిధిలోని 4,6,10 వార్డుల్లోని టీచర్స్ కాలనీ, నెహ్రూ వీధి, బాలజీ వీధి, మల్లిఖార్జున వీధి, సాయిబాబా వీధి, పద్మనాభ వీధుల్లో ఇంటింటికి వెళ్లి నాలుగు సంవత్సరాల్లో వారికి అందిన సంక్షేమ పథకాలను వివరిస్తూ లబ్ధిదారులకు బుక్‌లెట్‌లు అందజేశారు. సీఎం పరిపాలన ఏవిధంగా ఉంది అని అడిగి మరీ, 2024 ఎన్నికల్లో వైఎస్సార్ సీపీని ఆశీర్వదించాలని స్థానిక ప్రజలను కోరారు. ముఖ్యమంత్రిగా వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పాలన మొదలు పెట్టిన మొదటి రోజునుంచే అర్హులైన ప్రతి పేదవారికి సంక్షేమ ఫలాలు అందుతున్నాయని.. దీంతో మళ్లీ ఆయనే సీఎంగా కావాలని ప్రతి ఒక్కరు ఆకాక్షిస్తున్నారని అన్నారు. ప్రతి ఇంటి వద్ద ఎమ్మెల్యేకు ఘనస్వాగతం పలికారు. కార్యక్రమంలో ఎంపీపీ గజ్జల రాఘవేంద్రారెడ్డి, కౌన్సిలర్లు వైఎస్సార్ సీపీ పట్టణ ఇంచార్జ్ సుధాకర్‌రెడ్డి, నరసింహారెడ్డి, సింగం వెంకటేశ్వర్‌రెడ్డి, దామోదర్‌రెడ్డి, నల్లాపల్లె రఘునాథరెడ్డి పాల్గొన్నారు.

కుమారస్వామికి విశేష పూజలు


కుమారస్వామికి పూజలు నిర్వహిస్తున్న ఈఓ, అర్చకులు

శ్రీశైలంటెంపుల్: శ్రీశైల శ్రీభ్రమరాంబామల్లికార్జునస్వామివార్ల ఆలయ ప్రాంగణంలోని కుమారస్వామి ఉపాలయంలో మంగళవారం సందర్భంగా ఈఓ ఎస్ లవన్న, అర్చకులు విశేష క్రతువులను నిర్వహించారు. కుమారస్వామికి అభిషేకము, సుబ్రహ్మణ్య, అష్టోత్తరము చేసిన అనంతరం స్తోత్రపారాయణాలు చేశారు. సుబ్రహ్మణ్యస్వామివారికి పంచామృతాలు, వివిధ పండ్ల రసాలతో అభిషేక కార్యక్రమం నిర్వహించారు.

జాతీయ ఉపకార వేతనాలకు ఎంపిక


విద్యార్థినులను అభినందిస్తున్న హెచ్ఎం కోటయ్య, ఉపాధ్యాయ సిబ్బంది

చాగలమర్రి: మేజర్ గ్రామ పంచాయతీ చాగలమర్రిలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలకు చెందిన 9వ తరగతి విద్యార్థినులు అమృత వర్షిణి, సమీరా జాతీయ ఉపకార వేతనాలకు (ఎన్ఎంఎంఎస్) ఎంపికైనట్లు ప్రధానోపాధ్యాయుడు ఎం.కోటయ్య మంగళవారం తెలిపారు. ఇటీవల నిర్వహించిన ఉపకార వేతనాల పోటీ పరీక్షల్లో వీరిరువురు ప్రతిభ చూపి కేంద్ర ప్రభుత్వం అందించే రూ.12,000ల ఉపకార వేతనానికి అర్హత సాధించారన్నారు. ఈ ఉపకార వేతనాన్ని ఇంటర్ పూర్తయ్యే వరకు అందజేస్తారన్నారు. విద్యార్థినులు అమృతవర్షిణి, సమీరాలను మంగళవారం పాఠశాల హెచ్ఎం తో పాటు సిబ్బంది శాస్త్రి, హరినాథరెడ్డి, రవీంద్రారెడ్డి, శ్రీనివాసులు, పీడీ దాదాపీర్ అభినందించారు.

వలంటీర్ పోస్టులకు ఇంటర్వ్యూలు

చాగలమర్రి: చాగలమర్రి మండలంలో ఖాళీగా ఉన్న 7 వలంటీర్ పోస్టులకు మంగళవారం ఎంపీడీఓ కార్యాలయంలో త్రిసభ్య కమిటీ సభ్యులు ఎంపీడీఓ మహబూబ్‌దౌలా, తహసీల్దార్ సుభద్రమ్మ, పీఆర్ ఏఈ కొండారెడ్డి అభ్యర్థులకు ఇంటర్వ్యూలు నిర్వహించారు. ఎంపీడీఓ మాట్లాడుతూ చాగలమర్రి మేజర్ గ్రామపంచాయతి పరిధిలోని 1,2,6 వార్డుల లో- 3 ఖాళీలు, చింతలచెరువులో 2, తోడేండ్ల పల్లెలో-1, కలుగోట్లపల్లెలో-1 పోస్టులు ఖాళీగా ఉన్నాయన్నారు. వీటికి మొత్తం 13 మంది దరఖాస్తు చేసుకున్నారని, రెండు దరఖస్తులు తిరస్కరణకు గురయ్యాయన్నారు. మిగిలిన 11 మంది దరఖాస్తుదారులకు మంగళవారం తమ కార్యాలయంలో ఇంటర్వ్యూ నిర్వహించామని తెలిపారు. ఎంపికైనవారి జాబితా బుధవారం ప్రకటిస్తామన్నారు.

క్విట్ ఇండియా స్ఫూర్తితో దేశాన్ని రక్షించుకుందాం



నిరసన వ్యక్తం చేస్తున్న ఏఐటీయూసీ నాయకులు

నంద్యాల(న్యూటౌన్): క్విట్ ఇండియా ఉద్యమ స్ఫూర్తితో మోదీ నుంచి దేశాన్ని రక్షించుకుందామనే నినాదంతో సీఐటీయూ, ఐఎఫ్‌టీయూ, రైతు సంఘం ఆధ్వర్యంలో నంద్యాల పట్టణంలో బైక్ ర్యాలీ నిర్వహించారు. మంగళవారం జరిగిన కార్యక్రమంలో సీఐటీయూ నాయకులు తోటమద్దులు, నాగరాజు, ఐఎఫ్‌టీయూ నాయకులు చౌడప్ప, రైతు సంఘం జిల్లా కార్యదర్శి రాజశేఖర్ మాట్లాడుతూ కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం అధికారంలోకి వచ్చినప్పటి నుంచి కార్మికులకు ఉన్న 44చట్టాలను నాలుగు లేబర్ కోడ్‌లుగా కుదింపు చేసి పెట్టు బడిదారులకు, కార్పొరేట్ సంస్థలకు బానిసలుగా చేస్తోందని అన్నారు. ప్రభుత్వ రంగ సంస్థలను ప్రైవేటు పరం చేసి ఉద్యోగులకు ఉద్యోగ భద్రత లేకుండా మోదీ ప్రభుత్వం చేస్తుందన్నారు. కార్యక్రమంలో లక్ష్మణ్, బాలవెంకట్, రామచంద్రుడు తదితరులు పాల్గొన్నారు.

మోదీని గద్దెదింపాలి

నరేంద్రమోదీ ఈ సారి అధికారంలోకి వస్తే ఈ దేశాన్ని తాకట్టు పెట్టే పరిస్థితి వస్తుందని ఆయనను తక్షణమే గద్దె దించాలని ఏఐటీయూసీ జిల్లా నాయకులు శ్రీనివాసులు అన్నారు. మంగళవారం శ్రీనివాససెంటర్‌లో, సాయిబాబానగర్‌లో ఏఐటీయూసీ ఆధ్వర్యంలో మానవహారం, నిరసన కార్యక్రమాలను నిర్వహించారు. క్విట్ ఇండియా ఉద్యమ స్ఫూర్తితో విజయవాడలో పెద్ద ఎత్తున నిర్వహిస్తున్న కార్మిక గర్జనకు కార్మికులంతా తరలివచ్చి విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు. ఏఐటీయూసీ నాయకులు రవికుమార్, ప్రతాప్, మున్సిపల్ యూనియన్ నాయకులు తదితరులు పాల్గొన్నారు.

నేటి నుంచి 'నాభూమి-నాదేశం'

నంద్యాల(అర్బన్): ఆజాదీకా అమృత్ మహోత్సవ్ కార్యక్రమంలో భాగంగా బుధవారం నుంచి నా భూమి–నా దేశం, నేలతల్లికి నమస్కారం–వీరులకు వందనం కార్యక్రమాన్ని గ్రామ పంచాయతీల్లో నిర్వహిస్తున్నట్లు ఎంపీడీఓ సుగుణశ్రీ తెలిపారు. స్థానిక కార్యాలయంలో మంగళవారం ఆమె మాట్లాడుతూ ఈనెల 9న బిల్లలాపురం, పెద్దకొట్టాల, భీమవరం గ్రామాల్లో, 10న చాబోలు, అయ్యలూరు, పాండురంగాపురం, చాపిరేవుల, పుసులూరు, 11న కానాల, మిట్నాల, గుంతనాల, బ్రాహ్మణపల్లె, పోలూరు, మునగాల, 12న రాయమాల్పురం, పులిమద్ది, కొత్తపల్లి గ్రామ పంచాయతీల్లో ఆజాదీకా అమృత్ మహోత్సవ్ వేడుకలు నిర్వహించాలన్నారు.

రుద్రవరం మండలంలో..

రుద్రవరం: మండలంలో బుధవారం నుంచి నాభూమి- నాదేశం అనే కార్యక్రమం నిర్వహిస్తామని ఎన్ఆర్ఈజీఎస్ ఏపీఓ ప్రతాప్ తెలిపారు. 9న ఆలమూరు, యల్లావత్తుల, హరినగరం, 10న చిత్రేణిపల్లె, యర్రగుడిదిన్నె, ముత్తలూరు, కొండమాయపల్లె, చందలూరు, 11న బీర వోలు, చిలకలూరు, డి.కొట్టాల, శ్రీరంగాపురం, రుద్రవరం, 14న నర్సాపురం, ఆర్‌నాగులవరం, కోటకొండ, పేరూరు, మందలూరు చిన్నకంబలూరు పెద్దకంబలూరు గ్రామాల్లో కార్యక్రమం నిర్వహిస్తామన్నారు.

స్వచ్ఛ సంకల్పంపై కళాజాతా

చాగలమర్రి: స్థానిక జిల్లా పరిషత్ ఉన్నత బాలుర పాఠశాలలో స్వచ్ఛ సంకల్పంపై శివప్రసాద్ కళాజాతా సభ్యుల ఆధ్వర్యంలో మంగళవారం విద్యార్థులకు గ్రామాల్లో స్వచ్ఛత, పరిశుభ్రతపై కళాజాత నిర్వహించారు. ఈ సందర్భంగా కళాజాతా బృంద సభ్యురాలు వెంకటలక్ష్మి విద్యార్థులకు ఆటల, పాటల ద్వారా విద్యార్థులకు అవగాహన కల్పించారు. కార్యక్రమంలో హెచ్ఎం కోటయ్య, కార్యదర్శి మనోజ్ కుమార్, ఉపాధ్యాయ సిబ్బంది, విద్యార్థులు పాల్గొన్నారు.

వలంటీర్ పోస్టులకు ఇంటర్వ్యూలు

రుద్రవరం: స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో ఎంపీడీఓ మధుసూదన్‌రెడ్డి మంగళవారం వలంటీర్ల నియామకానికి మౌఖిక పరీక్షలు నిర్వహించారు. ఆర్ నాగులవరం, హరినగరం గ్రామాల్లో ఖాళీగా ఉన్న వలంటీర్ల స్థానాలను భర్తీ చేసేందుకు నిర్వహించిన ఇంటర్వ్యూకు ఐదుగురు అభ్యర్థులు హాజరయ్యారు.

గ్రామం యూనిట్‌గా వరిపంట


మాట్లాడుతున్న ఏఎస్ఓ ప్రహ్లాద్

నంద్యాల(అర్బన్): 2023–24 ఖరీఫ్‌కు సంబంధించి పీఎంఎఫ్‌బీవై కింద వరి పంటను గ్రామ యూనిట్‌గా తీసుకున్నట్లు మండల వ్యవసాయాధికారి ప్రసాదరావు తెలిపారు. స్థానిక కార్యాలయంలో ఏఎస్ఓ ప్రహ్లాద్ ఆధ్వర్యంలో మండలంలోని ఏఈఓ, వీఏఏ, వీహెచ్ఏ, ఎంపీఈఓలకు పంట కోత ప్రయోగాలపై శిక్షణా కార్యక్రమం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ జొన్న, సజ్జలు, కొర్రలు జిల్లా యూనిట్‌గా ఎంపిక చేశామని, వాతావరణ ఆధారిత బీమా కింద నంద్యాల జిల్లాలో అరటి, పత్తి, వేరుశనగ పంటలను ఎంపిక చేయడం జరిగిందన్నారు. ఉల్లిపంటను 2 x2 మీటర్లలో, ఆముదం, కంది, నువ్వులు, పత్తి పంటల్లో 10 x10, వరి, శనగ పంటల్లో 5 x5 మీటర్లలో ప్రయోగాలు చేస్తామ న్నారు. కార్యక్రమంలో ఏఈఓలు మణిమోహన్‌రెడ్డి, రవి, తదితరులు పాల్గొన్నారు.

మున్సిపల్ టౌన్‌హాల్‌లో రెండు ఏసీలు చోరీ

నంద్యాల(సిటీ): మున్సిపల్ టౌన్‌హాల్‌లో రెండు ఏసీలు చోరీకి గురైనట్లు మంగళవారం మున్సిపల్ కమిషనర్ రవిచంద్రారెడ్డి తెలిపారు. రోజువారీ విధుల్లో భాగంగా సిబ్బంది టౌన్‌హాల్‌ను శుభ్రం చేస్తుండగా రెండు ఏసీలు లేకపోవడాన్ని గుర్తించి ఉన్నతాధికారులకు తెలియజేశారు. ఈ మేరకు మున్సిపల్ కమిషనర్ రవిచంద్రారెడ్డి రెండో పట్టణ పోలీసు స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు.

వైఎస్సార్‌సీపీతోనే నంద్యాల అభివృద్ధి


సీసీ రోడ్డును ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే శిల్పా రవి, ఎమ్మెల్సీ ఇసాక్‌బాషా

నంద్యాల(సిటీ): వైఎస్సార్‌సీపీతోనే నంద్యాల అభివృద్ధి సాధ్యమైందని ఎమ్మెల్యే శిల్పా రవిచంద్ర కిశోర్‌రెడ్డి అన్నారు. మంగళవారం 4వ వార్డులో నూతనంగా నిర్మించిన సీసీ రోడ్లను ఎమ్మెల్సీ ఇసాక్ బాషాతో కలిసి ప్రారంభించారు. ఎమ్మెల్యే మాట్లాడుతూ వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం హయాంలో నంద్యాల రూపు రేఖలు మారిపోయాయన్నారు. ఎటూ చూసిన సీసీ రోడ్లు, డ్రైన్లతో జిల్లా కేంద్రం మరింత వేగంగా అభివృద్ధి చెందుతోందని చెప్పారు. కరోనా కారణంగా రెండు సంవత్సరాల కాలం వృథా అయినా కేవలం రెండేళ్ల వ్యవధిలో నంద్యాల పట్టణాన్ని అద్భుతంగా అభివృద్ధి చేశామన్నారు. ప్రతీ రోజు ఏదో ఒక ప్రాంతంలో అభివృద్ధి పనులను ప్రారంభించడమే కాకుండా కొత్త నిర్మాణాలకు కూడా భూమి పూజ చేస్తున్నామని తెలిపారు. రానున్న కాలంలో మరింతగా పట్టణాన్ని అద్భుతంగా తీర్చి దిద్దేందుకు చర్యలు చేపట్టామన్నారు. రాజకీయాలకు అతీతంగా పట్టణంలోని అన్ని ప్రాంతాల అభివృద్ధికి కృషి చేస్తున్నామన్నారు. కార్యక్రమంలో మున్సిపల్ చైర్ పర్సన్ షేక్ మాబున్నిసా, వార్డు కౌన్సిలర్ తబ్రేజ్, వైస్ చైర్మన్ పాంశావలి, మున్సిపల్ కమిషనర్ రవి చంద్రారెడ్డి, డీఈఈ మధు కుమార్, నాయకులు, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

ఓటరు సర్వేను సకాలంలో పూర్తి చేయాలి


మాట్లాడుతున్న ఎలక్టోరల్ అధికారిణి అనురాధ

నంద్యాల(అర్బన్): ఓటర్ల ఇంటింటి సర్వేను బీఎల్ఓలు సకాలంలో పూర్తి చేయాలని నంద్యాల నియోజకవర్గ ఎలక్టోరల్ అధికారిణి అనురాధ సూచించారు. స్థానిక నిశాంత్ భవన్‌లో మంగళవారం నియోజకవర్గ స్థాయి బీఎల్ఓలతో సమావేశం నిర్వహించారు. ఆమె మాట్లాడుతూ నంద్యాల నియోజకవర్గంలో 88,850 గృహాలు ఉండగా ఇప్పటి వరకు 26,320 గృహాల సర్వే మాత్రమే పూర్తయ్యిందన్నారు. అదే విధంగా నియోజకవర్గంలో 2,61,105 మంది ఓటర్లు ఉండగా 75,325 ఓటర్లను సర్వే చేశారన్నారు. ఫారం–8కు 1920 దరఖాస్తులు, ఫారం–7కు 96, ఫారం–6కు 500 దరఖాస్తులు ఇప్పటి వరకు వచ్చాయని, ఇంటింటి సర్వేలో బీఎల్ఓలు నిర్లక్ష్యం వహిస్తే చర్యలు తప్పవని హెచ్చరించారు. అంతకు ముందు తహసీల్దార్ కార్యాలయంలో ఓటర్ల అభ్యంతరాలపై రాజకీయ పార్టీల నాయకులతో జరిగిన సమావేశంలో బీఎల్ఓల వెంట పార్టీలకు బూత్‌స్థాయి ఏజెంట్లను పంపాలని సూచించారు. కార్యక్రమంలో గోస్పాడు ఇన్‌చార్జ్ తహసీల్దార్ విజయశేఖర్, ఎన్నికల సీనియర్ అసిస్టెంట్ చంద్రనాయక్ వైఎస్సార్‌సీపీ నాయకులు సన్నల సాయిరాంరెడ్డి, అనిల్‌అమృత రాజ్ తదితరులు పాల్గొన్నారు.

ప్రారంభమైన నామినేషన్ల ప్రక్రియ


రిటర్నింగ్ అధికారి అనురాధకు నామినేషన్ పత్రాలను అందజేస్తున్న శ్రీనివాసులరెడ్డి

చాగలమర్రి: గ్రామ పంచాయతీల పరిధిలో ఖాళీగా ఉన్న స్థానాలకు ఎన్నికల నామినేషన్ ప్రక్రియ మంగళవారం ప్రారంభమయ్యింది. మండలంలోని రాంపల్లే గ్రామంలో వార్డు మెంబరు దూదేకుల బావక్క, బ్రాహ్మణపల్లె గ్రామంలోని 5వార్డు మెంబరు ముక్కర్ల రామలింగారెడ్డి ఆనారోగ్య కారణాలతో మృతి చెందడంతో ఆ స్థానాల్లో ఖాళీ ఏర్పడింది. కాగా తొలిరోజు బ్రాహ్మణపల్లె 5వ వార్డుకు సంబంధించి గ్రామానికి చెందిన శ్రీనివాసులరెడ్డి రిటరిన్నింగ్ అధికారికి నామినేషన్ పత్రాలు అందజేశాడు. కార్యక్రమంలో అసిస్టెంట్ రిటర్నింగ్ అధికారి స్వర్ణకుమార్, వైఎస్సార్‌సీపీ నాయకుడు ఈదుల బ్రహ్మానందరెడ్డి పాల్గొన్నారు.

19న వార్డు మెంబర్ ఎన్నిక

గోస్పాడు: ఈనెల 19వ తేదీన వార్డు సభ్యుల ఎన్నిక నిర్వహించనున్నట్లు ఎన్నికల అధికారి, ఎంఈఓ అబ్దుల్ కరీం తెలిపారు. మండలంలోని రాయపాడు గ్రామంలో 2వ వార్డుకు ఎంపికైన శివారెడ్డి మృతి చెందడంతో ఉప ఎన్నిక అనివార్యం అయ్యింది. అందులో భాగంగా రాష్ట్ర ఎన్నికల కమిషన్ నోటిఫికేషన్ విడుదల చేసింది. ఈ మేరకు నామినేషన్ల ప్రక్రియ ప్రారంభమైందని, ఈ నేల పదో తేదీ వరకు కొనసాగుతుందని చెప్పారు.

సాగులో మెలకువలు పాటించాలి


రైతులకు సూచనలిస్తున్న సైంటిస్టు డాక్టర్ రామకృష్ణారావు

మిడుతూరు: సాగులో మెలకువలు పాటిస్తే అధిక దిగుబడులు సాధించవచ్చని జిల్లా ఏరువాక కేంద్రం ప్రిన్సిపల్ సైంటిస్టు డాక్టర్ రామకృష్ణారావు అన్నారు. మంగళవారం మండల పరిధిలోని కడుమూరు, మాసపేట గ్రామాల్లో ఆత్మ ఆధ్వర్యంలో జీవన ఎరువులు – జీవ సంబంధ పురుగు మందులపై రైతులకు శిక్షణ ఇచ్చారు. ఆయన మాట్లాడుతూ రైతులు పురుగుల నివారణకు విచక్షణా రహితంగా రసాయన మందులు వాడటంతో పురుగులు నిరోధక శక్తిని పెంచుకుంటాయని, అంతేకాక పంటల మీద మందుల అవశేషాలు మిగిలిపోతాయని తెలిపారు. దీంతో వాతావరణం, పర్యావరణం కూడా దెబ్బతింటుందన్నారు. సాగు ఖర్చులు విపరీతంగా పెరుగుతాయన్నారు. రైతులు జీవన ఎరువులు వేసుకోవాలని, పురుగుల మందులకు ప్రత్యామ్నాయంగా జీవసంబంధ పురుగు మందులను వాడాలని సూచించారు. అదేవిధంగా పత్తి, మొక్కజొన్న, మిరప, ఉల్లి తదితర పంటలలో తెగుళ్ల నివారణోపాయాలపై అవగాహన కల్పించారు. కార్యక్రమంలో నంద్యాల ఏడీఏ మంజువాణి, ఆత్మా బీటీఎం ఉమామహేశ్వరి పాల్గొన్నారు.